నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

తమకు ఆత్మీయ భరోసా ఎందుకు రాలేదంటూ తిరుమలాయపాలెం మండలంలోని పైలట్ గ్రామమైన ఏలువారిగూడెం సభలో కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న పచ్చిపాల అలివేలమ్మ (ఫైల్)

అర్హులకూ పంగనామాలు?

'పేరు గొప్ప – ఊరు దిబ్బ' అనే సామెతలా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దుర్బుద్ధితో అలవిగాని హామీలు ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయలేక మల్లగుల్లాలు పడుతోంది. ఈ క్రమంలో నమ్మి ఓట్లేసిన ప్రజలకే పంగనామాలు పెడుతోంది. ఇందుకోసం అనేక ప్రయత్నాలు చేస్తోంది. నిరుపేదలందరికీ పథకాలను అందిస్తామంటూనే అర్హులను మాత్రం గణనీయంగా తగ్గిస్తోంది. గొప్పగా చెప్పిన రుణమాఫీ విషయంలోనూ సరిగ్గా ఇదే విధానాన్ని అవలంబించింది. దీంతో లక్షలాది మంది రైతులకు ఇంకా రుణమాఫీనే జరగలేదు. ఇటీవల నాలుగు పథకాలకు అర్హులను ఎంపిక చేశామంటూ గ్రామసభలను పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అనర్హుల పేర్లతో జాబితాలను నింపింది. లిస్టుల్లో పేర్లను చూసిన నిరుపేదలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పథకాలన్నీ అనర్హులకు, అధికార పార్టీ కార్యకర్తలకు ఇచ్చి.. మాలాంటి పేదలకు పంగనామాలు పెడతారా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అయితే, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని చెప్పని ప్రభుత్వం.. అర్హులకు మాత్రం మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటూ సూచించింది. అయితే, ఎంపిక చేసిన అర్హుల్లోనూ తన మార్కును చూపించుకుంది. అన్ని పథకాలకూ అరకొరగానే అర్హులను ఎంపిక చేసింది. దీంతో ఏ గ్రామసభను చూసినా నిలదీతలే కన్పించాయి. దీంతో 'పేరుకు మాత్రం పథకాన్ని అమలుచేసినట్లుగా ఉండాలి. కానీ ఆ పథకం అర్హులందరికీ చేరొద్దు. కొద్దిమందికి మాత్రమే పథకాన్ని చేర్చి.. అందరికీ అమలుచేసినట్లు ప్రచారం చేసుకోవచ్చు' అనే పన్నాగం పన్నినట్లు స్పష్టమవుతోంది. తిరుమలాయపాలెం మండలంలోని పైలట్ గ్రామమైన ఏలువారిగూడేన్ని పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్టంగా అర్థమవుతోంది.

-తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 2

- 'పైలట్' గ్రామాల్లోనూ 'పథకాల ఎగవేత'కు ప్రభుత్వం కొర్రీలు!
- 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఎంపికల్లో స్పష్టంగా సర్కారు తీరు
- తిరుమలాయపాలెం మండలంలో 18,165 ఈజీఎస్ జాబ్ కార్డులు
- 'భరోసా'కు ఎంపికచేసిన కార్డులు కేవలం 1,767 మాత్రమే
- అంటే ఏకంగా 90 శాతం 'ఉపాధి' కార్డులకు కోత పెట్టిన ప్రభుత్వం
- ఆపది శాతం మందికే 27న నగదు జమ చేసి చేతులు దులుపుకున్న సర్కారు
- 20 పనిదినాలు ఉన్నప్పటికీ చాలామందిని ఎంపిక చేయని రాష్ట్ర ప్రభుత్వం
- పైలట్ గ్రామం ఏలువారిగూడెంలో 46 మందికిగాను 22 మందే ఎంపిక
- రుణమాఫీ సహా అన్ని పథకాల్లోనూ అర్హులను భారీగా తగ్గిస్తున్నారంటూ విమర్శలు

అలవిగాని హామీలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఓట్లేసి గెలిపించిన ప్రజలను ఎలాగైనా బోల్తా కొట్టించాలని చూస్తున్నట్లుగా కన్పిస్తోంది. 'ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అనే నాలుగు పథకాలను గణతంత్ర దినోత్సవమైన జనవరి 26 నుంచి అమలు చేస్తామని, ఈ పథకాలకు అర్హులను ఇప్పటికే గుర్తించామని ప్రకటించిన ప్రభుత్వం.. గత నెల 21 నుంచి 24 వరకూ ఊరూరా గ్రామసభలు పెట్టి అర్హుల జాబితాను ప్రదర్శించింది. దీంతో ఆయా జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో ప్రతి ఊరిలోనూ గ్రామసభలు రసాభాసగా మారాయి. ఎక్కడ చూసినా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీసిన దృశ్యాలే కన్పించాయి. తమకు అర్హత ఉన్నప్పటికీ తమ పేరును జాబితాలో చేర్చకపోడం, అదే సమయంలో అనర్హులను చేర్చడం వంటి కారణాలతో ప్రభుత్వంపై నిరుపేదలు మండిపడ్డారు. ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తే ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే అర్హుల సంఖ్యను భారీగా తగ్గించినట్లు స్పష్టమవుతోంది. ఉదాహరణకు ఆ నాలుగు పథకాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలుచేస్తున్న పైలట్ గ్రామమైన తిరుమలాయపాలెం ఏలువారిగూడేన్ని పరిశీలిస్తే అర్హులను ఏ స్థాయిలో తగ్గించారో వెల్లడవుతోంది.

18,165 జాబ్‌కార్డులు..
1,767 మందే అర్హులు..

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరిట పథకాన్ని అమలుచేస్తున్నామని, దీని ద్వారా భూమి లేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ జాతీయ ఉపాధి హామీ కార్డు కలిగి ఉన్న వాళ్లు, దానిపై ఏడాది (2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 లోపు)లో కనీసం 20 పనిచేసిన వాళ్లే దీనికి అర్హులని ప్రకటించింది. అయితే, ఈ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వాళ్లు అనేకమంది ఉన్నప్పటికీ వారిలో భారీ స్థాయిలో కోతలు విధించింది. తిరుమలాయపాలెం మండలంలో 18,165 కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులున్నాయి. వీరిలో అసలు భూమి లేని కుటుంబాలు సుమారు 10 వేలు ఉంటాయి. అయితే అనేక కొర్రీలు పెట్టిన ప్రభుత్వం.. మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో కేవలం 1,767 కుటుంబాలనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా గుర్తించింది. అంటే సుమారు 90 శాతం మందిని అనర్హులను చేసింది. కానీ ఆయా గ్రామసభల్లో ఈ పథకం జాబితాలో తమ పేర్లు లేని అర్హులంతా ప్రభుత్వాన్ని నిలదీశారు. అయితే, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సలహా ఇచ్చినప్పటికీ.. అప్పటికే ఎంపికచేసిన వారికి మాత్రం (అర్హులు+అనర్హులు) రూ.6 వేల చొప్పున నగదు బదిలీ చేసింది. పైలట్ గ్రామమైన ఏలువారిగూడెంలో ఇందిరమ్మ ఇళ్లకు 55 మందిని అర్హులుగా గుర్తించింది. 13 మందికి మాత్రమే మంజూరు పత్రాలు అందజేసింది. రేషన్‌కార్డులకు 35 మందిని గుర్తించి 18 మందికి పత్రాలు అందించింది. ఆత్మీయ భరోసాలో 46 కుటుంబాలకు అర్హత ఉన్నప్పటికీ కొర్రీల కారణంగా కేవలం 22 కుటుంబాలకే వర్తింపజేసింది. ఇంకా 24 కుటుంబాలకు ఎగనామం పెట్టింది.

మూడేళ్లుగా పనిచేస్తున్నా.. భరోసా రాలేదు..

ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కాంగ్రెస్ చెప్పుకుంటున్నప్పటికీ పేదలకు మాత్రమే అన్యాయమే జరుగుతోంది. మా తండలో భూమిలేని నిరుపేదలకు పథకాలేమీ రాలేదు. రేషన్ కార్డుకు దరఖాస్తు పెట్టుకున్నాం. అదీ రాలేదు. గత మూడేళ్లుగా కరువు (ఉపాధి హామీ) పనికి వెళ్తూనే ఉన్నాను. మాకు సెంటు భూమి కూడా లేదు. కానీ మాకు ఆత్మీయ భరోసా రాలేదు.

-గుగులోత్ మౌనిక, ఏలువారిగూడెం

ప్రభుత్వం కొర్రీలు పెడుతోంది.

మా ఊళ్లో అనేకమంది పేద గిరిజనులకు ఆత్మీయ భరోసా పథకం రాలేదు. పేదలకు ఇచ్చే పథకాలకు ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనికి వెళ్లి ఉండాలని అధికారులు చెబుతున్నారు. నేను అంతకన్నా తక్కువ రోజులు పనిచేశానని చెబుతూ నాకు ఈ పథకాన్ని వర్తింపజేయలేదు.

-గుగులోత్ సునీత, ఏలువారిగూడెం

నవ తెలంగాణ.. ఘనత కేసీఆర్‌దే

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, చిత్రంలో కూరాకుల, ఆర్‌జేసీ

ఖమ్మం, ఫిబ్రవరి 2: తెలంగాణను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా తీర్చిదిద్ది, దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌కు దక్కిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ క్యాలెండర్‌ను, డైరీని ఆయన ఆదివారం నగరంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి పాలన బాగుందా, ఫామ్ హౌస్ పాలన బాగుందా' అని, కాంగ్రెస్ పార్టీ పెట్టిన పోల్ సర్వేలో వారికే ఎదురుదెబ్బ తగిలిందని అన్నారు. ఏడాది గడిచినా కూడా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా, కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ నాయకులకు, ప్రభుత్వ పెద్దలకు ఈ పోల్ ద్వారా నెటిజన్లు కర్రు కాల్చి వాత పెట్టారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్మాణాలను వదిలేసి, కూల్చివేతలు సాగిస్తున్నదని, అందరినీ రోడ్డున పడేస్తున్నదని విమర్శించారు. జనవరి 26 నుంచి రైతు భరోసా టకీ..టకీమని పడుతుందని సీఎం చెప్పినప్పటికీ, అనేకమంది రైతుల ఖాతాల్లో నేటికీ డబ్బులు జమ కాలేదని ధ్వజమెత్తారు. దీని ఫలితంగా, ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఒక్క రైతులను మాత్రమే కాదు. మహిళలు, యువత.. ఇలా అందరినీ ప్రభుత్వం మోసగిస్తున్నదని విమర్శించారు. ''మన ఖమ్మం.. నేను మంత్రిగా ఉన్నప్పుడు ఎంత అందంగా ఉందో, ఇప్పుడు ఎంత అధ్వానంగా మారిందో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు'' అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేత వచ్చిందని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ శ్రేణులు సమరోత్సాహంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ''మీ అందరికీ కేసీఆర్, కేటీఆర్‌తోపాటు నేను కూడా అండగా ఉన్నాను'' అని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్ జేసీ కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జిల్లా మైనారటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కొల్లు పద్మ, లీగల్ సెల్ బాధ్యుడు కొత్త వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు–నాయకులు నాగండ్ల కోటి, పసుమర్తి రాంమోహన్‌రావు, బడిగం శ్రీనివాస్, పల్లా రోజ్‌లీనా, దాదె అమృతమ్మ, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, కొప్పెర నర్సింహారావు, రఘు, పిన్ని కోటేశ్వరారావు, కొంటెమ్ముల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కలిసికట్టుగా శ్రమించాలి

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువజన నాయకులందరూ కలిసికట్టుగా శ్రమించాలని, భవిష్యత్ ఎన్నికల్లో విజయం మనదేనని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యువజన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన నాయకులందరూ భవిష్యత్ కార్యాచరణపై శ్రమించాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలని పిలుపునిచ్చారు. మండల, పట్టణ వార్డు, బూతు యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ నాయకులు కుంట లక్ష్మణ్, అక్కి నర్సింహారావు, యువజన నాయకులు బోశెట్టి రవిప్రసాద్, బానోత్ రమేశ్, గుర్రం సృజన్, హర్షనాయుడు, పద్దం శ్రీను, పవన్‌నాయక్ పాల్గొన్నారు.

జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేవు..

జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేవని కేంద్ర బడ్జెట్‌తో మరోసారి రుజువైందని రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఆ 16 మంది కలిసి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీసుకొచ్చింది అక్షరాల గుండు సున్నా అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన రేవంత్‌రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఇవాళ ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. వరుసగా రెండో ఏడాది తెలంగాణకు చిల్లిగవ్వ కూడా తీసుకురాలేకపోయిన బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్, బీజేపీలకు ఎంపీలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు

- ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకే అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సత్తుపల్లి నియోజకవర్గంలో రోజంతా కొనసాగిన హైటెన్షన్
- బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నించడంతో కాంగ్రెస్ నాయకుల అరెస్టు
- తమ వారినెలా అరెస్టు చేస్తారంటూ పోలీసులపై 'దయానంద్' ఆగ్రహం
- సత్తుపల్లి పీఎస్ నుంచి వేంసూరు పీఎస్‌కు బీఆర్ఎస్ నేతల తరలింపు
- అక్కడ బీఆర్ఎస్ నేతలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర
- నిఘా వర్గాల సమాచారం మేరకే అదుపులోకి తీసుకున్నాం: ఏసీపీ
- ఏడాదిపాటు సంయమనం పాటించాం.. ఇక ప్రజా పోరాటమే: సండ్ర వెంకటవీరయ్య

పోలీసులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నేత దయానంద్

అరెస్టయి వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్/ వేంసూరు, ఫిబ్రవరి 2: ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఆదివారం తెల్లవారుజామున బీఆర్ఎస్ నేతలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆయా నేతల ఇళ్లకు వెళ్లిన పోలీసులు.. నాయకులను నిద్రిలేపి మరీ వెంట తీసుకెళ్లారు. తమను బ్రష్ కూడా చేసుకోనివ్వకుండా ఎందుకు తీసుకెళ్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించినప్పటికీ.. సమాధానం చెప్పకుండానే పోలీసులు తమ వెంట తీసుకొని వెళ్లారు. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు.. ఉదయాన్నే సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. పరిస్థితి అదుపు తప్పుతుందేమోనని భావించి అరెస్టు చేసిన 19 మంది బీఆర్ఎస్ నేతలను హుటాహుటిన పోరుగునే ఉన్న వేంసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులను కూడా అరెస్టు చేసేందుకు పోలీసులు వారి ఇళ్లకు వెళ్లారు. అయితే, తమనెందుకు అరెస్టు చేస్తారంటూ కాంగ్రెస్ నాయకులు కొందరు పోలీసులపై మండిపడ్డారు. అయినప్పటికీ 29 మంది కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేసి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అయితే, సత్తుపల్లి పోలీసుస్టేషన్‌కు చేరుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు, స్థానిక ఎమ్మెల్యే రాగమయి భర్త దయానంద్.. తమ నేతలనెందుకు అరెస్టు చేస్తారంటూ పోలీసులను ప్రశ్నించారు. అలాగే, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా వేంసూరు పీఎస్‌లోని బీఆర్ఎస్ నాయకులను పరామర్శించారు. అయితే, ఎన్నికల కోడ్ ఉన్నందున తాము ఆందోళనలేమీ చేయబోమని అటు దయానంద్, ఇటు సండ్ర పోలీసులకు హామీ ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయా నాయకుల సంతకాలు తీసుకొని విడుదల చేశారు.

అసలేం జరిగిందంటే..

సత్తుపల్లి మున్సిపల్ పాలకవర్గానికి ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్నందున బీఆర్ఎస్‌కు చెందిన పాలకవర్గ సభ్యులు గత నెల 31న అభినందన కార్యక్రమం నిర్వహించుకున్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య.. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తుపల్లిలో అవినీతి రాజ్యమేలుతోందని అన్నారు. 'డీ' ట్యాక్స్ (స్థానిక ఎమ్మెల్యే రాగమయి భర్త దయానంద్) పేరున అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ నాయకులు వసూళ్లు చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1న కాంగ్రెస్ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సండ్ర వ్యాఖ్యలను ఖండించారు.ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని, గత ప్రభుత్వంలోనే అనేక రకాలైన ట్యాక్స్‌లు వసూలు చేశారని ఆరోపించారు. వసూళ్లు, అవినీతి ఆరోపణలపై సత్తుపల్లి అంబేద్కర్ రింగ్‌సెంటర్ వద్దకు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో ఆదివారం రెండు పార్టీల నాయకులూ ఆదివారం సత్తుపల్లి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంటారని నిఘా వర్గాల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తీసుకెళ్లిన వారిలో బీఆర్ఎస్ నేతలు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, అద్దంకి అనిల్, గుండ్రు రాఘవేంద్ర, రఫీ, మల్లూరి అంకరాజు, వీరపునేని బాబి, దొడ్డా శంకర్‌రావు, నడ్డి ఆనందరావు సహా మొత్తం 19 మంది ఉన్నారు. ఈ విషయం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులకు తెలియడంతో పెద్ద ఎత్తున నేతలు సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంటున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు.. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించి అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను పొరుగునే ఉన్న వేంసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే రాగమయి వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు వారి ఇళ్లకు వెళ్లారు. అయితే, తాము అధికార పార్టీ నేతలమని, తమనెందుకు అరెస్టు చేస్తారని కొందరు నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ పోలీసులు ఆ నేతలను అరెస్టు చేసి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రింగ్‌సెంటర్ వద్ద కూడా పోలీసులను భారీగా మోహరించారు. అయితే, తమ కాంగ్రెస్ నేతలు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, మానుకోట ప్రసాద్, కమాల్‌పాషా, దోమ ఆనంద్ సహా 29 మందిని అరెస్టు చేశారనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి భర్త దయానంద్.. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తమ నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని పోలీసులపై మండిపడ్డారు. అధికార పార్టీ నేతలను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ప్రశ్నించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ బయట దయానంద్ విలేకరులతో మాట్లాడారు. సండ్ర వెంకటవీరయ్య ఎమ్మెల్యేగా ఉన్న 15 ఏళ్లు అవినీతికి పాల్పడ్డాడని, ఆ విషయంలో తమ నేతలు బహిరంగ చర్చకు పిలిచారని, అందుకు తమ నేతలను అరెస్టు చేయడం సబబు కాదని, తక్షణమే వదిలివేయాలని అన్నారు. తాము నిరసనలు చేపట్టబోమని హామీ ఇవ్వడంతో సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్‌కుమార్.. కాంగ్రెస్ నేతల నుంచి సంతకాలు తీసుకొని వదిలివేశారు. ఇక వేంసూరు పీఎస్‌లోని బీఆర్ఎస్ నేతలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శించారు. నిద్రిస్తున్న తమ నాయకులను వేకువజామునే అక్రమంగా అరెస్టు చేసి ఉన్న పళంగా తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని పోలీసులను ప్రశ్నించారు. పీఎస్ ఎదుట విలేకరులతో సండ్ర మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో గడిచిన ఏడాది పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను రుజువు చేసే విషయంలో తాము స్పష్టంగా ఉన్నామని, చర్చకు ఎక్కడైనా సిద్ధమేనని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పోలీసులను ఇబ్బంది పెట్టే విధంగా తాము నిరసన కార్యక్రమాలు చేపట్టబోమని కల్లూరు ఏసీపీ రఘుకు ఫోన్‌లో హామీ ఇవ్వడంతో వేంసూరు పీఎస్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతల నుంచి సంతకాలు తీసుకొని వదిలివేశారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ రఘు మాట్లాడుతూ.. రెండు పార్టీల నాయకులు ఆదివారం బహిరంగ చర్చకు వస్తారనే సమాచారంతోనే వారిని ముందస్తుగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇలాంటి చర్చలు, సభలకు అనుమతి లేదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలగకూడదనే ఉద్దేశంతోనే రెండు పార్టీల నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ఏడాదిపాటు సంయమనం పాటించాం: సండ్ర

చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులే సవాళ్లు విసిరారని, బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటకవీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలను పరామర్శించిన అనంతరం పీఎస్ బయట విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా ఉన్న సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు ఘర్షణలకు తెరలేపుతున్నారని విమర్శించారు. 15 ఏళ్ల కాలంలో ఇక్కడి శాసనసభ్యుడిగా ఏ రోజు రెచ్చగొట్టి పద్ధతిలో తాను వ్యవహరించలేదని స్పష్టం చేశారు. సవాళ్లు విసిరిందెవరో సత్తుపల్లి ప్రజలకు తెలుసునని అన్నారు. కొత్త ప్రభుత్వ పాలనపై ఏడాది కాలంగా తాము సంయమనం పాటిస్తున్నామని అన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఘర్షణలతో సత్తుపల్లి నియోజకవర్గ సంస్కృతికి చెడ్డపేరు సాక్షాత్తూ క్యాబినెట్ మంత్రి తుమ్మల ఇటీవలి అధికారిక సభలో చెప్పినప్పటికీ ఆ పార్టీ నేతలే దానిని భగ్నం చేసుకుంటున్నారని అన్నారు. గంగారంలో కోడిపందేలు నిర్వహిస్తూ అరెస్టయిన నాయకులెవరో, హైదరాబాద్‌లో గంజాయి కేసులో పట్టుబడింది ఏ నాయకుడి కొడుకో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. తాము ప్రజల పక్షానే ఉంటున్నామని, ప్రశ్నించే పార్టీగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. సత్తుపల్లి, వేంసూరు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చారు.

కాంగ్రెస్ నాయకుడిపై బీఆర్ఎస్ ఫిర్యాదు

బీఆర్ఎస్ వేంసూరు మండల అధ్యక్షుడు, వెంకటాపురం మాజీ సర్పంచ్ పాల వెంకటరెడ్డిపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పుచ్చకాయల సోమిరెడ్డి వ్యక్తిగత ఆరోపణ చేశాడంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, పగుట్ల వెంకటేశ్వరరావు, మారోజు సురేష్, దొడ్డ వెంకటకృష్ణారెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, జాబిశెట్టి కోటేశ్వరరావు, కొండపల్లి రాంబాబు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి సకాలంలో హాజరుకావాలి: కలెక్టర్

కొత్తగూడెం టౌన్/ భద్రాచలం, ఫిబ్రవరి 2: కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లో ప్రజావాణి ప్రారంభమవుతుందని అన్నారు. ప్రజలు లిఖితపూర్వకంగా అందించే వినతులు, ఫిర్యాదులపై స్పందించేందుకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్: పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 2: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌కు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

అభినందనలు
అండర్ -19 వరల్డ్ క్రికెట్ కప్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి భారత దేశానికి కప్ సాధింపజేసిన మన భద్రాచలం ముద్దుబిడ్డ గొంగడి త్రిష గారికి అభినందనలతో...
మారుతి కాలేజ్